పర్యావరణ పరిరక్షణలో పౌరుల భాగస్వామ్యం అవసరం

స్వచ్ఛతా హి సేవలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్


స్వచ్ఛత సేవలో ఎమ్మెల్యే శివకుమార్, అధికారులు

తెనాలి: మనం బాగుండాలంటే చుట్టూ ఉన్న వాళ్లంతా బాగుండాలని, మనం ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదంగా ఉండాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ప్రతి ఒక్కరిలో విశాలమైన సానుకూల దృక్పథం ఉన్నపుడే సమాజం బాగుంటుందని చెప్పారు. పట్టణ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'స్వచ్ఛతా హి సేవ'లో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. తొలుత మున్సిపల్ కూరగాయల మార్కెట్ ఎదుటగల మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం పరిశుభ్రత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహాత్మాగాంధీ ఆశయాల మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు ప్రకారం స్వచ్ఛత కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల భాగస్వామ్యంతో మున్సిపాలిటీ చేపట్టటం అభినందనీయమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో పౌరులు తమ బాధ్యతను, భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్లాస్టిక్ నివారణకు గుడ్డ సంచీలను వినియోగించాలని చెప్పారు. వీలైనంతవరకు ప్లాస్టిక్ జోలికి పోకుండా ఉండాలని సూచించారు. ఇంటి ముంగిటే కాదని, చుట్టూ ఉన్న పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఖాళీస్థలం ఉందికదాని, ఇంట్లో చెత్తనంతా వేయొద్దని చెప్పారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న చెత్త సేకరణ విధానాన్ని అనుసరించాలని కోరారు. విద్యార్థులు కూడా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకుని, పౌరుల్ని చైతన్యవంతుల్ని చేయాలని సలహానిచ్చారు. అయితానగర్లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలు ఎన్‌సీసీ విద్యార్థులు 'స్వచ్ఛత సేవా నూకడ్ నాటక్'ను ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఆరోగ్య అధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.అనుపమ, జి.ప్రసాద్, ఎం.సుబ్బారావు, షేక్ బాజీ హుస్సేన్, వై.లక్ష్మీనారాయణ, మెప్మా సీఎం ఎం.మాధవరావు, ఉద్యాన అధికారి శేషుబాబు, ఎన్‌సీసీ అధికారి బెల్లంకొండ వెంకట్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.


వల్లభాపురంలో రోడ్డు వెంట చెట్లను తొలిగిస్తున్న గ్రామస్తులు, కార్మికులు


వైకుంఠపురం దేవస్థాన ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి ర్యాలీ నిర్వహించిన బీజేపీ నాయకులు

■ భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షుడు మైలా హరికృష్ణ ఆధ్వర్యంలో పట్టణ వైకుంఠపురంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానల్ సభ్యుడు పాటిబండ్ల రామకృష్ణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు మంచాల రత్నంరాజు, నాయకులు శిఖా రవీంద్ర, బిత్రా కనకదుర్గ, బోలిశెట్టి సాయికృష్ణ, సింగంరాజు కనకదుర్గ, లీలారామ్, జగదీస్, శ్రీనాథ్, యశ్వంత్, మైలా నాగార్జున, వంశీ, గోపి, సాయి పాల్గొన్నారు.

వల్లభాపురంలో శ్రమదానం

వల్లభాపురం(కొల్లిపర): వ్యాపారులు, గ్రామస్తులు వ్యర్థాల్ని రోడ్లపై వేయవద్దని సర్పంచ్ వల్లభాపురం నిర్మల సూచించారు. ఆదివారం మండలంలోని వల్లభాపురంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో శ్రమదానం చేశారు. రోడ్డు వెంట చెట్లు, ముళ్ల కంపను తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా పంచాయతీ ట్రాక్టర్‌కు అందజేయాలని సూచించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో ఉన్న వ్యాపారులకు ఆమె పలు సూచనలు చేశారు. తొలత పంచాయతీ కార్యాలయం వద్ద చెత్త సేకరణ కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అవుతు పోతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అలకనందన, బుజ్జి బాబు, చెత్త సేకరణ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ...

తెనాలి: స్వచ్ఛతా హి సేవలో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. చెంచుపేటలోని మదర్ థెరిస్సా విగ్రహం నుంచి స్విమ్మింగ్ పూల్ వరకు రోడ్డును శుభ్రం చేశారు. తెనాలి రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, జేఎంజే కాలేజీ యూత్ రెడ్‌క్రాస్ విభాగం, యూత్ రెడ్‌క్రాస్ వింగ్ కన్వీనర్ పాటిబండ్ల హేమలత, జేఎంజే కాలేజీ ఎన్ఎస్ఎస్ కన్వీనర్ సుజాత, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


రోడ్డు శుభ్రం చేస్తున్న రెడ్‌క్రాస్ వలంటీర్లు

శ్రీకల్కి సేవాసమితి ఆధ్వర్యంలో

స్వచ్ఛతా హి సేవలో భాగంగా శ్రీకల్కి సేవాసమితి, తెనాలి ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నందులపేటలోని కవిరాజ పార్కులో చెత్తాచెదారాన్ని, గడ్డిమొక్కల్ని తొలగించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పరిసరాల్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాల్ని నిర్వహిస్తామని సభ్యులు తెలియజేశారు.


పార్కును పరిశుభ్రం చేస్తున్న శ్రీ కల్కి సేవాసమితి సభ్యులు

నందిసాగర్ చెరువులో తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపు


తూటికాడ తొలగిస్తున్న సర్పంచ్ పవన్‌కుమార్, అధికారులు.

తెనాలి టౌన్: 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా రూరల్ మండలం నందివెలుగులోని నందిసాగర్ చెరువులో తూటికాడ, గుర్రపు డెక్కను సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, అధికారులు, ఉపాధి హామీ కూలీలు, వలంటీర్లు ఆదివారం తొలగించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాల్ని శుభ్రం చేసినట్లు సర్పంచ్ పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయాలక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి సుభాష్ చంద్రబోస్, ఎంపీటీసీ సభ్యురాలు తిన్నలూరి వియలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వేముల మహేష్, తన్నీరు వెంకటేశ్వరరావు, నల్లూరి రాఘవేంద్రరావు, ధూళిపాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ నాయకుడు తోటకూర కోటేశ్వరరావు, వలంటీర్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

స్వచ్ఛత సేవలో ఎల్ఐసీ ఉద్యోగులు

తెనాలి: చెత్తరహిత భారతదేశం నినాదంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్వచ్ఛతా హి సేవా'లో భాగంగా ఎల్ఐసీ, తెనాలి శాఖ ఉద్యోగులు, ఏజెంట్లు ఆదివారం రూరల్ మండలం నందివెలుగులో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నందివెలుగు గ్రామ సర్పంచ్ ధూళిపాళ పవన్‌కుమార్ ప్రారంభించారు. ఎల్ఐసీ తెనాలి సీనియర్ బ్రాంచి మేనేజరు ఎం.గౌతమ భీమారావు మాట్లాడుతూ పరిరాలు శుభ్రంగా లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండటం సాధ్యం కాదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం అందరి బాధ్యతగా చెప్పారు. తెనాలి బ్రాంచి అసిస్టెంట్ డివిజనల్ మేనేజరు సీహెచ్. రమేష్, ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ నాయకులు వేదాంతం ఫణీంద్ర, దేవరకొండ వెంకటసుబ్బారావు, కోళ్లపూడి రాజు, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ నాయకులు పూర్ణనారాయణ, రమేష్, ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు బొకినాల పీటర్‌పాల్, దిరిసల వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అసిస్టెంట్ బ్రాంచి మేనేజరు శ్రీకాంత్‌రమణ పర్యవేక్షించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఏజెంట్లు

వయో వృద్ధుల హక్కుల కోసం ప్రత్యేక చట్టాలు

2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత


సత్కార గ్రహీతలతో శ్రీసీత, అసోసియేషన్ నేతలు

తెనాలి: వయో వృద్ధులకు న్యాయపరమైన హక్కుల సాధనకు తగిన చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి హాజరై, వయోవృద్ధులకు సంబంధించిన చట్టాల్ని వివరించారు. సీనియర్ సిటిజన్లు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. వృద్ధులకు సంబంధించిన కేసుల్ని త్వరితగతిన విచారించేందుకు తగిన వెసులుబాటు ఉందంటూ, ఆ వివరాలను తెలియజేశారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా న్యాయ సలహాలు, సేవలు అందించడానికి మండల స్థాయిలో లీగల్ సెల్ అందుబాటులో ఉందని చెప్పారు. అవసరమైనవారు సేవల్ని వినియోగించుకోవాలని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అభివృద్ధికి డాక్టర్ నర్రావుల ఆదినారాయణ, సతీమణి లక్ష్మీసునీత రూ.10 వేల విరాళం ఇచ్చినందుకు సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. 75 ఏళ్లు నిండిన అయిదుగురు సభ్యులు, సహస్ర పూర్ణ చంద్ర దర్శనం చేసుకున్న మందలపు పూర్ణచంద్రరావును సత్కరించారు. సెప్టెంబరులో జన్మించిన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహబూబ్, చలమయ్య, హనుమారెడ్డి, సీతారామయ్య, రామకృష్ణ పాల్గొన్నారు. కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఆరోగ్య బీమా కార్డుతో పలు ఉపయోగాలు

- ఐఎంఏ తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి
- ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ క్యాంపులో 312 మందికి కార్డుల పంపిణీ


కార్డులు పంపిణీ చేస్తున్న ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి

తెనాలి: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అందిస్తున్న ఆరోగ్య బీమా కార్డు బ్యాంకు లాకర్లో దాచుకున్న డబ్బుతో సమానమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆరోగ్య బీమాకు ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషను శిబిరం నిర్వహించారు. సభకు సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డ్ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసేవల్ని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అందిస్తుందని చెప్పారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఇంటెన్సివ్ కేర్ సదుపాయాలను ఈ కార్డుతో పొందవచ్చని చెప్పారు. ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డ్ ఆయుషును పెంచే సంజీవనిగా చెప్పారు. కార్డుదారులు మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్లో ఉచితంగా వైద్యాన్ని పొందవచ్చని చెప్పారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ పెన్నీ మినిస్ట్రీస్ సేవల్ని అభినందించారు. రిజిస్ట్రేషన్ అనంతరం మొత్తం 312 మందికి ముఖ్య అతిథులతో ఆరోగ్య బీమా కార్డులను పంపిణీ చేయించారు. కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు దాసరి శివనారాయణ, మిలటరీ ప్రసాద్, పోగర్తి రాజేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో అంతర్గతంగా పరమాత్మ చైతన్యం

తెనాలి: ప్రతి ఒక్కరిలో అంతర్గతంగా పరమాత్మ చైతన్యం ఉంటుందని, దీన్ని అనుభూతి చెందే హక్కు ఎవరికి వారికి ఉంటుందని శ్రీమాతా రాజ శ్యామల పీఠం, నిర్మల్ వ్యవస్థాపకుడు శివ రాజయోగి కృష్ణ స్వామీజీ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని శ్రీరాధాకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం మహాప్రాణవిద్య గురుదీక్షను నిర్వహించారు. పరమాత్మ చైతన్యాన్ని అనుభూతి పొందే దివ్య సాధనను మహాప్రాణవిద్య గురుదీక్ష రూపంలో శివరాజయోగి కృష్ణ స్వామీజీ శిష్యులకు అందించారు. తర్వాత ఆయన స్వయంగా ప్రతిష్ఠించీకరించిన పంచముఖ రుద్రాక్షను ప్రసాదంగా అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు శివ లలిత, కవిత, శ్రీరాం, అనిత పర్యవేక్షించారు.


కృష్ణస్వామీజీ

ఘనంగా అల్లు రామలింగయ్య శత జయంతి

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అల్లు రామలింగయ్య నాటక కళా పరిషత్, వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పద్మశ్రీ డాక్టర్ అల్లు రామలింగయ్య శత జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మేకప్ ఆర్టిస్ట్ కె.సూరిబాబు, సినీ డైరెక్టర్ కొల్లి బాబి, జబర్దస్త్ టీం పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఆహ్వాన నాటకోత్సవాల్ని ప్రారంభించారు. తోలుగాటు శ్రీనివాసరావు రచన, దర్శకత్వంలో 'నెట్' నాటిక, గోవిందరాజుల నాగేశ్వరరావు రచన, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వంలో 'పక్కా ఇంటి మొగుడు' హాస్య నాటికలు ఉత్సాహంగా సాగాయి. అనంతరం డైరెక్టర్ బాబి, సినీ రచయిత కోన వెంకట్, సినీ నటుడు సప్తగిరి, జబర్దస్త్ టీం గెటప్ శ్రీను, చమ్మక్ చంద్ర, సత్య, రాకెట్ రాఘవలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని కళా పరిషత్ అధ్యక్షుడు పెండెం వెంకట శివప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆర్.రామకృష్ణ, కార్యదర్శి డి.సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



మేకప్ ఆర్టిస్ట్ సూరిబాబును సత్కరిస్తున్న డైరెక్టర్ బాబి, సప్తగిరి

గాంధీజీ, కస్తూర్బా విగ్రహాలకు పంచ అభిషేకాలు

తెనాలి: గాంధీ జయంతి సందర్భంగా స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమంలోని గాంధీజీ, కస్తూర్బా విగ్రహాలకు తేనె, పాలు సహా పంచ అభిషేకాల్ని చేశారు. గాంధీ సత్యనిష్ఠ, అహింసను ప్రపంచం మరువరాదని, ఆయన అడుగుజాడల్లో సమాజహితానికి కృషి చేయాలన్న సందేశాన్ని చాటాలనే ఉద్దేశంతో వారోత్సవాల్ని నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి చెప్పారు. ఆశ్రమ కమిటీ సభ్యులు, ఆశ్రమవాసులు పాల్గొన్నారు.


గణేష్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువకులు

భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

తెనాలి టౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణ, రూరల్ గ్రామాల్లో వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలల్ని ఊరేగించి ఆదివారం కాల్వల్లో నిమజ్జనం చేశారు. పట్టణ సుల్తానాబాద్ సుగాలీ కాలనీలో ఎస్ఎస్ఎస్ యూత్ ఆధ్వర్యంలో 14వ మహా గణపతి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. అనంతరం తూర్పు కాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, శంకర్‌నాయక్, బాలాజీ, వాసు, శ్రీను నాయక్, సుగాలీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.


గణేష్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న యువకులు

సమష్టి కృషి వల్లే ఇస్రో విజయం



నగరంపాలెం: సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్, గెట్ టు గెదర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఇస్రో శాస్త్రవేత్త మానస దంపతుల్ని ఘనంగా సత్కరించారు. మహిళలు ఇటువంటి బృహత్తర కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ ఇస్రో విజయం సమష్టి కృషికి నిదర్శనమని తెలిపారు. కార్యక్రమానికి మన్నే సుబ్బారావు అధ్యక్షత వహించగా, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నూతలపాటి తిరుపతయ్య, కార్యదర్శి దాసరి హనుమంతరావు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి దండ బహూకరణ

తెనాలి టౌన్: రూరల్ మండలం నందివెలుగులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని ఆదివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సందర్శించి, పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కానుగోలు సురేష్ ఆలయానికి రూ.50వేలు విలువచేసే వెండి దండను బహూకరించారు. ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా దండను అందజేశారు. ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్, తదితరులు పూజలు చేశారు. ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూళిపాళ్ల పవన్‌కుమార్, నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, కల్యాణం అరుణ, తన్నీరు వెంకటేశ్వరరావు, ధూళిపాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరానికి స్పందన

తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. వాసవీ క్లబ్ గవర్నర్ గోనుగుంట్ల జయంత్‌కుమార్ సౌజన్యంతో ఏర్పాటైన శిబిరంలో పలువురు మహిళలు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి పర్యవేక్షించారు. జిల్లా కన్వీనర్ జానీబాషా, టెక్నీషియన్ చలపతి, వాసవి క్లబ్ బి.వెంకటేశ్వర్లు, రామమోహనరావు, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


అలరించిన అన్నమయ్య పద సంకీర్తనలు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై ఆదివారం సాయిశ్రుతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నమయ్య పద సంకీర్తనా వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సంగీత విద్యాంసురాలు బి.సీతామహాలక్ష్మి పలు అన్నమాచార్య కీర్తనల్ని అలపించారు. వయోలిన్‌పై డి.శ్రీనివాసశాస్త్రి, ఫ్లూట్‌పై ఆర్.ప్రేమ్‌కుమార్, మృదంగంపై బి.సురేష్‌బాబు, తబలాపై పి.రమణయ్య వాయిద్య సహకారం అందించారు.

భవ్య హంతకులను కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: చిత్తూరు జిల్లాలో పెనుమూరు మండలానికి చెందిన భవ్యశ్రీపై అత్యంత దారుణంగా అత్యాచారం చేసి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లో ఆదివారం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన భవ్యశ్రీని పొట్టనపెట్టుకున్న నిందితులపై తక్షణ చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు



నగరంపాలెం: అరండల్‌పేటలోని శ్రీ మోహన రంగనాయక స్వామి వారి దేవస్థానం ఆవరణలో ఆదివారం రాధా మాధవ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 304వ నెలనెలా వెన్నెలలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వభారతి కూచిపూడి ఆర్ట్ అకాడమి (విజయవాడ), నటరాజ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో చిన్నారుల కూచిపూడి నాట్యాలు సభికుల్ని అలరించాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు. అసోసియేషన్ నిర్వాహకులు షేక్ ఖలీల్, నృత్య దర్శకుడు ఎం.కాశీవిశ్వనాథ్, అనంతుల విజయకుమారి పాల్గొన్నారు.

హైస్కూలుకు రోటరీ క్లబ్ టీవీ వితరణ

గుంటూరు ఎడ్యుకేషన్: కొరిటెపాడులోని శ్రీ రంగాచార్య మెమోరియల్ ఓరియెంటల్ హైస్కూల్లో విద్యార్థులకు డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు నేతృత్వంలో రూ.20వేలతో ఎల్ఈడీ టీవీ బహూకరించారు. పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయికి చేరుకోగలరని సూచించారు.